క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శ్రీవారి 53వ వార్షిక కల్యాణ మహోత్సవం



సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్‌లో గల అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు కలియుగ దైవం శ్రీ అలివేలుమంగా పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వారి దేవాలయ 53వ వార్షికోత్సవ సందర్భంగా సోమవారం శ్రీవారి కల్యాణం భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీవారిని శోభాయమానంగా అలంకరించి శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు చిత్రకవి శ్యాం దాసన్ ఆచార్యులు కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీవారి అనుగ్రహ ప్రాప్తిని పొందారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ పభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మృతుని కుటుంబానికి వైఎస్సార్ బీమా అందజేత



సత్తెనపల్లి: పట్టణంలోని 27వ వార్డుకు చెందిన షేక్ జాని బాష మృతి చెందగా వారి కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద మట్టి ఖర్చుల కింద రూ.10 వేలు నగదును మృతుడి భార్య షేక్ మున్నీకి సోమవారం కో ఆప్షన్ మెంబర్ షేక్ మౌలాలి అందించారు. షేక్ జాని బాష మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ మహెబుల్లా, పార్టీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల మధ్య ఫ్లెక్సీల వివాదం



అమరావతి: మండల పరిదిలోని అమరావతి ధరనికోట గ్రామంలో మంగళవారం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పర్యటనను పురస్కరించుకుని ఫ్లెక్సీల ఏర్పాటులో మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, మరో నాయకుడు ఎన్ఆర్ఐ వట్టికుంట శేషగిరిరావు వర్గీయుల మధ్య వివాదం నెలకొంది. సోమవారం ఇరు వర్గాలవారు ఫ్లెక్సీల ఏర్పాటు చేసుకునే సమయంలో అటు ధరణికోట, ఇటు అమరావతిలో ఇరువర్గాల మధ్య ఘర్షణవాతావరణం ఏర్పడింది. ఈక్రమంలో కొన్ని చోట్ల వట్టికుంట శేషగిరిరావు వర్గీయులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేయడం జరిగింది. దీంతో వట్టికుంట శేషగిరిరావవు వర్గీయులు తాము వట్టికుంట చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కార్యకర్తలకు భోజనాలు ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు చేస్తుంటే కొమ్మాలపాటి వర్గీయులు ఆటంకం కల్పిస్తున్నారని ఆరోపిస్తున్నారు.
అలాగే సోషల్‌మీడియా వేదికగా తమ ఫ్లెక్సీలను చించివేసింది కొమ్మాలపాటి వర్గీయులేనని విమర్శలు గుప్పిస్తున్నారు.

కోడెల పేరు తలుచుకోకపోవడం బాధాకరం

టీడీపీ నాయకుడు డాక్టర్ కోడెల శివరాం

సత్తెనపల్లి: మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు పేరు తలుచుకోకపోవడం బాధాకరమని టీడీపీ నాయకుడు డాక్టర్ కోడెల శివరాం అన్నారు. సత్తెనపల్లిలో జరిగిన టీడీపీ విస్తృతస్థాయి సమావేశం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ సోమవారం సత్తెనపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ కుటుంబంలో పెద్ద దిక్కులాగా, తండ్రి స్థానంలో ఉన్న చంద్రబాబు నాయుడు తమకు న్యాయం చేస్తారని, గౌరవప్రదమైన స్థానం ఇస్తారని భావిస్తున్నామన్నారు.

నివేశన, సాగు భూములు ఇవ్వాలని వినతులు

యడ్లపాడు: నివేశన స్థలాలను మంజూరు చేయాలంటూ సోమవారం తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో పలువురు వినతి పత్రాలు సమర్పించారు. మండలంలోని జగ్గాపురం ఎస్టీ కాలనీకు చెందిన 45 కుటుంబాలకు నివేశన స్థలాలు లేవంటూ ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎస్. నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో వై హనుమారెడ్డికి జగ్గాపురం ఎస్టీలు వినతిపత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని ఎస్టీ కాలనీ సమీపంలో సర్వే నంబర్ 312/బీ1లో 1.ఎకరా 50 సెంట్ల స్థలం ఉందని, వాటిని అర్హులకు పంపిణీ చేయాలని కోరారు. మండలంలో ఉన్న మిగులు భూములు 150 ఎకరాలను సాగు కోసం కుటుంబానికి 2 ఎకరాలు పంపిణీ చేయాలని కోరారు. ఎస్టీ కమ్యూనిటీ హాలు శిథిలావస్థలో ఉందని సంబంధిత కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేయించి బాగు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక సభ్యులు మొగిలి తిరుపతిరావు, మొగలి ఏడుకొండలు, బి.చిన్న నాయక్, పాలపర్తి శ్రీనివాసరావు, ఎస్టీ కాలనీవాసులు వి.పోలయ్య, కె.శ్రీనివాసరావు, కె.రామకోటయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం కోసం ప్రభుత్వం కృషి

- మండల పరిషత్ అధ్యక్షురాలు షేక్ యలవర్తిపాటి జైబూన్‌బీ
- ఘనంగా 30వ జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం
- మండల స్థాయిలో 11 పంచాయతీలకు పురస్కారాలు



మండలస్థాయిలో ఫణిదం సర్పంచ్ వేమవరపు బుల్లిబాబుకు పురస్కారం అందజేస్తున్న ఎంపీపీ జైబూన్‌బీ, ఎంపీడీఓ సత్యనారాయణ

సత్తెనపల్లి: మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని సత్తెనపల్లి మండల పరిషత్ అధ్యక్షురాలు షేక్ యలవర్తిపాటి జైబూన్‌బీ అన్నారు. 30 వ జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలను సోమవారం సత్తెనపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ షేక్ యలవర్తిపాటి జైబున్ బీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ పాలన ప్రజలకు చేరువ చేస్తూ గ్రామ/వార్డు సచివా లయాలను ఏర్పాటు చేశారన్నారు. ఆయా కార్యాలయాల్లో 11 మంది సిబ్బందిని కేటాయించి ప్రజలకు సమర్థవంతమైన సేవలను అందిస్తున్నారని కొనియాడారు. పంచాయతీ రాజ్ దినోత్సవ ఆవశ్యకత ను వివరించారు. ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ మాట్లాడుతూ సుపరిపాలన కోసం పంచాయతీ రాజ్ వ్యవస్థ ఎలాంటి పాత్ర పోషిస్తుందో, పంచాయతీ వ్యవస్థ విలువ గురించి వివరించారు. ఈఓపీఆర్‌ఆర్డీ బీ. దయాసాగర్, ఏ.ఓ సీహెచ్ బసవ కుమారిలు మాట్లాడారు. ముందుగా భారత జాతి పిత మహాత్మా గాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చిత్ర పటాలకు పుష్పాలంకరణ తో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన లో భాగంగా మండల స్థాయిలో, 9 అంశాల లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మూడేసి పంచాయతీలకు పురస్కారాలను అందజేశారు. నాలుగు అంశాల్లో దూళ్ళిపాళ్ల, ఫణిదం, లక్కరాజు గార్ల పాడు, అబ్బూరు పంచాయతీలు, మూడు అంశాల్లో బృగుబండ, దీపాలదిన్నె పాలెం పంచాయతీలు, ఒక్కో అంశంలో భీమవరం, రెంటపాళ్ళ, గుడిపూడి, పాకాలపాడు, లక్ష్మీపురం పంచాయతీలు పురస్కారాలకు ఎంపిక కాగా ఆయా పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు పురస్కారాలను అందించారు. పురస్కారాలను స్వీకరించడం ఆనందంగా ఉందని, తమ బాధ్యతను మరింత పెంచిందని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పేర్కొన్నారు. మండల స్థాయిలో అందుకున్న ఈ పురస్కారంతో రెట్టించిన ఉత్సాహంతో పనిచేసి ప్రజలకు సేవలంది స్తామని పంచాయతీ కార్యదర్శులు వెల్ల డించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీలకు అవార్డు ప్రదానం

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోను జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో భాగంగా సోమవారం గ్రామసభలు నిర్వహించారు. గ్రామంలో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఆయా గ్రామసభల్లో గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండల స్థాయిలో పలు విభాగాల్లో మెరుగైన చర్యలు చేపట్టినందుకు గాను ఆయా గ్రామసర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి అవార్డులు పంపిణీ చేశారు. అత్యధికంగా తొండపి గ్రామానికి గాను పలు విభాగాల్లో 9అవార్డులు అందుకోగా, ముప్పాళ్ళ గ్రామానికి 3, తురకపాలెం గ్రామానికి 1, గోళ్ళపాడు గ్రామానికి 2, రుద్రవరం గ్రామానికి 2, దమ్మాలపాడు గ్రామానికి 2 అవార్డులు అందించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్‌జెఎమ్‌రామలింగారెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ రూపవతి లు పాల్గొని అవార్డులను అందించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రోసూరు: మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. మండలంలోని 18 పంచాయతీల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించడం జరిగింది. తొమ్మిది ప్రధాన అంశాలపై ప్రథమ, ద్వితీయ, తృతీయ అంశాలపై మొత్తం 27 బహుమతులు, సర్టిఫికెట్లను గ్రామపంచాయతీలకు ప్రదానం చేయడం జరిగింది. అత్యధిక బహుమతులు తొమ్మిది గరికపాడు గ్రామపంచాయతీకి, తొమ్మిది బహుమతులు అనంతవరం గ్రామపంచాయతీకి, ఆరు బహుమతులు విప్పర్ల గ్రామపంచాయతీకి రెండు బహుమతులు పీసపాడు గ్రామపంచాయతీకి ,ఒక బహుమతి ఉయ్యందన పంచాయతీకి బహూకరణ చేయడం జరిగింది. కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అధ్యక్షులైన పి.కోటయ్య గారి అధ్యక్షతన ఎంపీడీఓ పి.శిరాయ్య ఆధ్వర్యంలో అందచేయడం జరిగింది. మండంలోని 18 గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ,పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.



పురస్కారాలు అందజేస్తున్న, ఎంపీపీ కోటయ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ శివరామయ్య



సర్పంచ్, కార్యదర్శులను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఉత్తమ కార్యదర్శులు, సర్పంచ్‌లకు సన్మానం

నకరికల్లు: గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది కలిసి పనిచేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉత్తమ సర్పంచ్‌లు, సచివాలయ కార్యదర్శులకు సన్మానం చేసి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకరికల్లు మండలం అభివృద్ధి పథంలో నిలిపేందుకు సహకరించిన ప్రతిఒక్కరికీ అభినందనలు తెలిపారు. ఆయావిభాగాల్లో ప్రతిభను కనబరిచిన సచివాలయం కార్యదర్శులు, సర్పంచ్‌లకు సన్మానం చేసి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బండి శ్రీనివాస రెడ్డి, వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలకే చంద్రబాబు పర్యటన

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: అభూతకల్పనలతో అసత్యప్రచారాలు చేయడానికే తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పెదకూరపాడు నియోజకవర్గంలో పర్యటిస్తున్నాడని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు. సోమవారం గుంటూరు ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు పేద ప్రజల అభివృద్ధికి ఎంతగానో ఉపయోగప డుతుంటే వాటిని అడ్డుకోవడానికే చంద్రబాబు రాష్ట్రమంతా తిరుగుతున్నాడన్నారు. కులం మతం, పార్టీ, వర్గం చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నకు వస్తున్న ప్రజాభిమానాన్ని చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు నిత్యం బురదచల్లుతున్నారన్నారు. ప్రజలంతా జగనన్న నువ్వే మా నమ్మకం అంటుంటే చంద్రబాబుకు, టీడీపీవారికి మాత్రం ఇంకా కనువిప్పు కలుగకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 15వేల సచివాలయాలపరిధిలో 7లక్షల మంది పార్టీ సైనికులు నిత్యం ప్రజల గడప వద్దకు వెళ్లి సంక్షేమ పథకాలు అందాయా లేకుంటే ఎందుకు అందలేదు వాటి కారణాలు విశ్లేషించి మేలు చేకూర్చే విధంగా పనిచేస్తుంటే ప్రజలందరు సంతృప్తిగా జగనన్న అండగా నిలుస్తుంటే చంద్రబాబు, ఎల్లోమీడియా ఓర్వలేక అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు.

నియోజకవర్గ పరిధిలో...

ఇప్పటికే నియోజకవర్గంలో ఉన్న 80 వేల గృహాల్లో 60 వేల గడపలు తొక్కి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామన్నారు. మరికొద్ది రోజుల్లోనే మిగిలిన 20వేల గృహాలను సందర్శిస్తామన్నారు. ఒకవైపు పీపుల్స్ మెగా సర్వేకు క్షేత్రస్థాయిలో వస్తున్న స్పందన, మరోవైపు టైమ్స్‌నౌ సర్వే ఫలితాలు చూసి ప్రతిపక్షానికి పిచ్చెక్కిపోతుందన్నారు. ప్రతిపక్షం బలంగా ఉన్న నియోజకవర్గాల్లో కూడా సర్వేకు సానుకూల స్పందన వస్తుంటే ప్రతిపక్షనాయకులు నిత్రలేని రాత్రులు గడుపుతున్నారన్నారు. రైతులకు, మహిళలకు రుణమాఫీ నెరవేర్చకుండా ఏ ముఖం పెట్టుకుని అమరావతి వస్తున్నారని ఆయన ప్రశ్నించారు. అమరావతి-తుళ్లూరు డబుల్‌రోడ్డు నిర్మాణపనులు ప్రారంభమ య్యాయని అలాగే పెదమద్దూరు వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణపనులు మొదలు పెట్టామన్నారు. అమరావతి నుంచి బెల్లంకొండ అడ్డరోడ్డు వరకు రోడ్డు నిర్మాణానికి టెండర్లు ప్రక్రియ పూర్తయిందని త్వరలో శంకుస్థాపన చేస్తున్నామన్నారు. మాదిపాడు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణం చేస్తున్నామన్నారు. తాము అభివృద్ధిని గ్రాఫిక్స్‌లో చూపడం లేదని కళ్ళకు కట్టినట్లు చూపిస్తున్నామన్నారు. సమావేశంలో క్రోసూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ ఈదా సాంబిరెడ్డి, జీడీసీసీ బ్యాంకు డైరక్టర్ కోట హరిబాబు, పెదకూరపాడు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, కాపు కార్పొరేషన్ డైరక్టర్ లేళ్ళ వెంకటరావు అమరావతి మండల సచివాలయ కన్వీనర్ భవిరిశెట్టి హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చిలకా సాంబయ్య, కంకణాల శివాజీ, షేక్ మస్తాన్ షరీఫ్, షేక్ సుబాని, అదంషఫీ, గురుపాదం పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ అధ్యక్షుడిగా మంచికంటి



సత్కారం అందుకున్న నూతన కార్యవర్గం

సత్తెనపల్లి: లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ అధ్యక్షుడిగా ప్రముఖ తెలుగు పండితుడు, ఆధ్యాత్మిక, సాహితీవేత్త అయిన మంచికంటి వెంకటేశ్వరరావును ఎన్నుకున్నారు. పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో సోమవారం లయన్స్ క్లబ్ సమావేశం ప్రసుత్త అధ్యక్షుడు తవిటి భావనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో రానున్న 2023-24 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా మంచి కంటి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా గుర్రం మహేశ్వరరావు, కొప్పురావూరి రాజశేఖర్, పెద్దింటి వెంకటేశ్వర్లు, తిరుమల సాంబ శివరావులు, కార్యదర్శిగా వల్లూరి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా డాక్టర్ వి.వి. ఆర్.కృష్ణమాచార్యులు, కోశాధికారిగా తోట పద్మావతి, లయన్ టేమర్ గా బి. వీరాంజ నేయులు, టేల్ ట్విస్టర్ గా డాక్టర్ ఎస్. నరసింహారావు లను ఎన్నుకున్నారు. సీనియర్ లయన్ మెంబర్స్ వై. పి. మురళి, లయన్ పెద్దింటి చంద్రయ్యలు ఎన్నికల నిర్వా హకులుగా వ్యవహరించగా కంబాల వెంకటేశ్వరరావు, పెరుమాళ్ళ శ్రీనివాస రావు, కోట వెంకటేశ్వర్లు, కంకణాల విష్ణువర్ధన్ రావు, ఇమ్మిడిశెట్టి జగన్మోహనరావు, తోట చిన్న సాంబశివయ్య, కొప్పురావూరి గురు ప్రసాద్, రోశయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నిక కాబడిన కార్యవర్గాన్ని క్లబ్ లోని సభ్యులందరూ పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

బీజేపీ విధానాలను వ్యతిరేకిస్తు సీపీఎం ప్రచారభేరి



మాట్లాడుతున్న విజయ్‌కుమార్, పక్కన సీపీఎం, సీపీఐ నాయకులు

నకరికల్లు: కులమతాల పేరిట దేశంలో అల్లకల్లోలం సృష్టిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు అన్నివర్గాల ప్రజలు కలసికట్టుగా పనిచేయాలని సీపీఎం పార్టీ పల్నాడుజిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. బీజేపీని సాగనంపుదాం -దేశాన్ని కాపాడుదాం నినాదంతో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఆటోప్రచారభేరీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఉమ్మడి సంపదగా ఉన్న బ్యాంకులు, ప్రభుత్వరంగ పరిశ్రమలు, ఓడరేవులను కార్పోరేట్‌శక్తులకు అమ్మి దేశసంపదను కొల్లడుతున్నారని అన్నారు. అన్నం పెట్టే వ్యవసాయాన్ని సైతం కార్పొరేట్‌శక్తులకు ధారాదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. సామాన్య ప్రజానీకానికి దేశంలో రక్షణకరువైందన్నారు. దేశాన్ని కార్పొరేట్ శక్తుల వశంచేస్తూ, కులాలపేరుతో వైషమ్యాలు రెచ్చగొట్టి మోసం చేస్తున్నారని అన్నారు. దుష్ట జీజేపిని గద్దె దించితేనే ప్రజాస్వామ్యం విరాజిల్లుతుందని అన్నారు. కార్యక్రమంలో కౌలురైతుసంఘం మండల కార్యదర్శి జి.పిచ్చారావు, ఈవూరి లక్ష్మారెడ్డి, ఈవూరి అప్పిరెడ్డి, ఆవుల వెంకటేశ్వర్లు, చట్టు కోటేశ్వరరావు, సిరిపల్లి రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

28న సత్తెనపల్లి తాలూకా సెంటర్లో బహిరంగ సభ

సత్తెనపల్లి: ప్రధాని నరేంద్ర మోడీ కబంధహస్తాల నుంచి దేశాన్ని కాపాడుకుందాం అని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ అన్నారు. పట్టణంలో సీపీఎం, సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రాజకీయ ప్రచార బేరి కార్యక్రమంలో సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ మోడీ నిరంకుశ విధానాలను వ్యతిరేకిస్తూ ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని చేపట్టిన రాజకీయ ప్రచార బేరి ముగింపు సందర్భంగా ఈనెల 28న స్థానిక తాలూకా సెంటర్లో బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ సభకు ఉపన్యాసకులుగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంపీ పీ.మధు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాదరావులు పాల్గొని మోడీ అనుస రిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తారన్నారు. కార్యక్రమంలో సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రవిబాబు, అనుముల వీరబ్రహ్మం, మామిడి జగన్నాథ రావు, అవ్వారు ప్రసాదరావు, గద్దె ఉమ శ్రీ, గుంటూరు మల్లేశ్వరి, అనంత వెంకట్ నారాయణ, దామర్ల వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకులు ఇర్మియా, తదితరులు పాల్గొన్నారు.

27న శ్రీబాబా గురుదేవ్ డిగ్రీ,పీజీ కళాశాలలో ఉద్యోగ మేళా

సత్తెనపల్లి: నిరుద్యోగ యువతకు పట్టణంలోని యాదవ హాస్టల్ రోడ్డు ఎదురు వైపు గల శ్రీ బాబా గురుదేవ్ డిగ్రీ, పీజీ కళాశాల క్యాంపస్‌లో ఈ నెల 27న హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగమేళా నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఈ ఉద్యోగమేళాలో ఎస్ఎస్ఎల్ టెక్నెల్ మాస్టర్ మైండ్ కాలేజ్, అపెక్స్ కంపెనీ, మెడ్ ప్లస్, నవత ట్రాన్స్పోర్ట్, అరబిందో కంపెనీ, హెట్టిరో, ఐసీఐసీఐ బ్యాంకు, భారత్ ఫ్లై, హావెల్స్, ఏషియన్ ఆటో పార్ట్స్, వసంత ఇండస్ట్రీస్, ఆచి మసాలా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఏసీసీఐ గార్మెంట్స్, లోయల్ టెక్స్టైల్స్, హైసస్ ఫుడ్స్, ఏటుబి ఫుడ్స్ ఇండస్ట్రీస్, టెలీ ఛాయిస్, లాంటి కంపెనీల నుండి ఉద్యోగ అవకాశం కల్పించబడు తుందన్నారు. వయస్సు 18 నుంచి 30 సంవత్సరాల స్త్రీ, పురుష అభ్యర్థులు ఎవరైనా అర్హులన్నారు. ఇంటర్వ్యూకు వచ్చు సమయంలో విద్య అర్హత, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, ఒక ఫోటో తెచ్చుకోవాలన్నారు. ప్రారంభ జీతం 12 వేల నుంచి టెన్త్, ఇంటర్మీడియట్ ,డిగ్రీ, (డిప్లమో, ఐటిఐ ఇంజనీ రింగ్) ఏదైనా గ్రూప్, ఏఎన్ఎం జిఎన్ఎమ్ పాస్ ఆర్ ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. పూర్తి వివరాలు ఈ నంబర్ల లో : 9030689949, 8520000469, 8106684915 సంప్రదించాలన్నారు.

వైభవంగా గంగలమ్మ తిరునాళ్ల



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

శావల్యాపురం: వేల్పూరు గ్రామంలోని గంగలమ్మ తిరునాళ్ల సోమవారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు దోర్నా శ్రీనివాసరావు అమ్మవారి మూల విరాట్‌ను నూతన వస్త్రాలు పూల దండలతో అలంకరించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారి సన్నిధిలో మహిళా భక్తులు పొంగళ్లు పొంగించి పసుపు, కుంకుమ నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తిరునాళ్లలో నాగులపాటి గాలిబాబు కుటుంబ సభ్యులు, యాదవ్ యూత్ సభ్యులు మజ్జిగ ప్యాకెట్లు పులిహోర పొట్లాలు పంపిణి చేశారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఆయన తనయుడు బొల్లా గిరిబాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు రెండు విద్యుత్ ప్రభలు, పౌరాణిక నాటకం, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఎస్సై గల్లా రవికృష్ణ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రంతు శ్రీనివాసరావు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు స్వర్ణాల వెంకటరావు,తూమాటి కబ్బారావు, ముండ్రు రాఘవరావు, ముండ్రు సాంబశివరావు, లింగా శ్రీనివాసరావు, సాదినేని చిన వెంకయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘర్షణలో 8 మందికి గాయాలు

చిలకలూరిపేటటౌన్: ఒక సామాజికవర్గంలోని రెండుగ్రూపుల మధ్య జరిగిన వివాదం ఘర్షణకు దారితీసింది. ఫలితంగా 8 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని మిట్టపాలెం ఎస్సీ కాలనీలో సోమవారం వెలుగులోకి వచ్చింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం మిట్టపాలెం గ్రామం ఎస్సీ కాలనీలో ఆదివారం ఒక గ్రూపునకు చెందిన వారు తమకు సమాచారం లేకుండా వేరే చోట జరిగిన కర్మకాండలకు హాజరయ్యారని వివాదం చెలరేగింది. మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో 8మందికి గాయాలయ్యాయి. ఇరు వర్గాలు పరస్పరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

నరసరావుపేట రూరల్: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మూరబోయిన సుబ్బాయమ్మ అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ సుబ్బాయమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ విజయకుమార్, వైస్ ఎంపీపీ యాంపాటి లక్ష్మీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాఖల వారీ ప్రగతిని అధికారులు వివరించారు. వేసవిని దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ యాసిన్ తెలిపారు. ఇప్పటికే బోర్ల మరమ్మతులు చేసినట్టు వివరించారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరాకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలను మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు వెల్లడించారు. సమావేశంలో పీఆర్ డీఈ కె.హరనాథ్, రూరల్ ఆర్ఐ వెంకటరెడ్డి పాల్గొన్నారు.


పంచాయతీలకు పురస్కారాలు...

జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ సేవలు అందిస్తున్న గ్రామ పంచాయతీయలకు మండల స్థాయిలో పురస్కారాలను సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అందజేసారు. కార్యక్రమంలో ఎంపీపీ మూరబోయిన సుబ్బాయమ్మ, ఎంపీడీవో శ్రీనివాసరావు, వైస్ యాంపాటి లక్ష్మీ పాల్గొన్నారు. తొమ్మిది విభాగాల్లో 27 గ్రామ పంచాయతీలకు ఈ పురస్కారాలను అందజేశారు.

వైభవంగా షిరిడీ సాయి ఆలయ వార్షికోత్సవం

నాదెండ్ల: నాదెండ్లలోని షిర్డీసాయిబాబా ఆలయ పదో వార్షికోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన పూజారి ఇర్లపాటి సాంబశివరావు ఉదయాన్నే స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు జరిపారు. గణపతి, నవగ్రహ, అష్టోత్తర నామ, గోత్రనామ పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

పీఏసీయస్ చైర్మన్‌గా రంగయ్య



అచ్చంపేట: అచ్చంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ చైర్మన్‌గా అచ్చంపేటకు చెందిన రామిశెట్టి రంగయ్యను నియమిస్తూ డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి షేక్ రహింతుల్లా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం రంగయ్య మాట్లాడుతూ తనతోపాటు సంఘ డైరెక్టర్లుగా సాతర్ల శ్రీనివాసరావు, తుమ్మాలూర్మమ్రెడ్డిల నియామకం జరిగిందన్నారు. రెండు మూడు రోజుల్లో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సహకారంతో సంఘ అభివృద్ధికి తోర్పడతానని, రైతులందరికి దీర్ఘకాలిక, మధ్యకాలిక రుణాలు ఇప్పించడంతో చొరవ చూపుతానన్నారు. సంఘ పరిధిలోని 9 గ్రామాల రైతులకు కావలసిన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను సబ్సిడీ ధరలకు అందచేయనున్నట్లు చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



దొడ్లేరులో ప్రకృతి వ్యవసాయం పై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

దొడ్లేరు(క్రోసూరు): దొడ్లేరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమంలో భాగంగా సోమవారం మా మంచి పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యకమంలో ఏఓ వేణుగోపాల్ పాల్గొని మాట్లాడారు. భూమిలో 30 రకాల విత్తనాలు వేసి 50 రోజులు తరువాత కలియదున్నడం ద్వారా నేలకు ప్రథమ, ద్వితీయ, సూక్ష్మపోషకాలు అందుబాటులోనికి వస్తాయని, నెలలో కార్బన్ శాతం పెరుగుగుందని తద్వారా వేసి ప్రధాన పంటకు వ్యాధి నిరోదక శక్తి పెరుగుతుందని సూచించడం జరిగింది. ప్రతి రైతు తనకు ఉన్న మొత్తం భూమిలో నవధాన్యాలు సాగు చేయాలని చెప్పారు. ఖరీఫ్ యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా ప్రతి రైతు క్యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని, ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేసి అధిక పెట్టుబడులు తగ్గించుకోవాలని, విచక్షణా రహితంగా పురుగు మందులు పిచికారి చేయడం వలన పర్యావరణం కలుషితం అవడం ,భూమి, నీరు కలుషితమవుతుందని తద్వారా పండిన పంటలు తిన్న ప్రతి ఒక్కరు అనారోగ్యానికి గురి అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముక్కు అంజలి , డివిజన్ ఎం.టీ సైదయ్య, బీఏఏ, వీహెచ్, దివ్య, కమల, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ మహిళలు రైతులు పాల్గొనడం జరిగింది.

మంచి నీటి ట్యాంక్ ప్రారంభం



బెల్లంకొండ: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చేయడమే ధ్యేయమని ఎంపీపీ చెన్నపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో మండల పరిషత్ నిధులతో గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు చిట్టెంశెట్టి శివనాగమణి నిర్మించిన ఐదు మంచినీటి ట్యాంకులను ప్రారంభించారు. ప్రతి ఏడాది వేసవి కాలం వచ్చే సమయానికి తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడుతుందని, దీనిని నివారించడానికి గ్రామంలో నీటి ట్యాంకులను నిర్మించినట్లు ఎంపీపీ తెలిపారు. పార్టీ నాయకులతో కలసి గ్రామంలో పలు కాలనీలకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు చింతారెడ్డి సాయిరెడ్డి. మర్రి ప్రసాదరెడ్డి, భద్రయ్య, గ్రామ సర్పంచ్ బ్రహ్మం, భాణావతు నరసింహానాయక్, గాదె మిల్లు వెంకటరెడ్డి, చిన తిరుపతయ్య, రామకోటి నాయక్, చందు కోటేశ్వరరావు, నందనమూడి వెంకటేశ్వరరావు, కర్రి గోపి, మన్నెం కోటయ్య, మేడతి గోపి తదితరులు పాల్గొన్నారు.